# అవార్డు శిక్ష

## 'సాక్షి'

ఉషార్' అంటూ కోర్టు బంట్రోతు జడ్జీగారి ఛాంబర్లోంచి బైటికి రాగానే కోర్టుహాల్లో వున్న ప్లీడర్లూ, పీపీలు, పోలీసులూ, కోర్టు గుమాస్తాలూ, సాక్షులూ ఆ వెనకే వున్న ప్రేక్షక మహాశయులూ అంతా ఒక్కసారిగా చటుక్కున లేచి నిల్చున్నారు.

జడ్జీగారు ఛాంబర్లోంచివచ్చి కోర్టు హాల్లో వున్నవారందరికీ నమస్కారం పెట్టి ధర్మపీఠంమీద ఆసీనులయ్యారు.

కోర్టులో వున్నవాళ్ళంతాకూడా జడ్జీ గారికి దండంపెట్టి కూర్చున్నారు. భక్తుల దండాలకి కరిగిపోని భగవంతుడిలా జడ్జీ గారు ఏమీ పట్టించుకోలేదు.

"కానివ్వండి" అన్నారు జడ్జీగారు బెంచి గుమాస్తానుద్దేశించి.

జైలునుంచి వచ్చిన ఖైదీల్ని తీసుకు రమ్మని బెంచి గుమాస్తా ఒక బంట్రోతుని పంపించాడు. ఆ తరువాత "పోలీస్ హన్మకొండా" అన్నాడు బెంచిగుమాస్తా.

ఆమాట వినగానే అక్కడున్న ఇంకో బంట్రోతు "పోలీసు హన్మకొండా హాజర్హో" అని అరుస్తూ బయటికి వెళ్ళాడు.

ఎవరైనా కొత్తవాళ్ళు వింటే బంట్రోతు గొంతు పడిపోతుందేమోనన్నట్లుగా మూడుసార్లు గొంతు చించుకొని అరిచాడు.

ఈ అరుపులు విని ఒక పోలీసు సబిన్స్పెక్టరు పరిగెత్తుకుంటూ వచ్చి సెల్యూట్ చేసి నిల్చున్నాడు.

"కొమరమ్మ కేసులో చార్జీ ఫ్రేమ్ చేస్తున్నారు కోర్టువారు" అని చెప్పాడు బెంచి గుమాస్తా సబిన్స్పెక్టర్కు.

ఈ మాట వినగానే కోర్టులో పెద్ద సంచలనం బయలుదేరింది. వెనక బెంచిలో వున్నవాళ్ళు గుసగుసలాడుతున్నారు. ప్లీడర్లు కొమరమ్మకి కోర్టు న్యాయవాదిని నియమిస్తానంటే వద్దందని వింతగా చెప్పుకుంటున్నారు.

"న్యాయవాదిని వద్దందంటె కొమరమ్మ కేసు ఒప్పుకుంటుందనేకదాఅర్థం" అని సందేహం వెలిబుచ్చాడు ఒక సీనియర్ లాయర్.

ప్లీడర్లకేకాదు అక్కడ కూర్చున్న జనానికికూడా కొమరమ్మ నేరం ఒప్పుకుంటుందేమోనన్న సందేహం పీడిస్తోంది.




అసలు కొమరమ్మ తను చేసిన పని ఎప్పుడూ దాచుకోలేదు. సరిగ్గా ఇవ్వాల్టికి అయిదునెల్లక్రితం, కొమరమ్మ తన వారం రోజుల కూలీ తీసుకొని ఎండుచేపలు, మంచినూనె, ఒక శేరు బియ్యం కొనుక్కొని గుడిసెకు చేరింది. అప్పుడు సూరీడు అస్తమిస్తున్నాడు. చీకటి కమ్ముకొంటోంది. కాని కొమరమ్మ ఇంట్లో అంతకు ముందెప్పుడో చీకటి స్థిరనివాసం ఏర్పర్చుకొన్నట్లుగా వుంది. ఇంట్లో మనుషులు వున్న అలికిడి లేదు.

"సీనుగా" అని కేకవేసి పెద్ద కొడుకుని పిలిచింది. ఆ కేకకి బదులు రాలేదు.

"ఎక్కడ చచ్చారో" అని పిల్లల్ని తిట్టుకొని చీకట్లో తడుముకొంటూ వెళ్ళి కిరసనాయిలు దీపంముట్టించింది. తాటాకు మంటపెట్టి పొయ్యి రాజేసి పొయ్యిమీద ఎసరు పడేసివచ్చి బియ్యం చేటలో పోసుకొని ఏరడం మొదలుపెట్టింది.

"అమ్మా నిద్దరొస్తోంది" అంటూ

వచ్చింది కొమరమ్మ చిన్నకూతురు లచ్చి. దానికి పాపం ఆకలికీ, నిద్రకీ తేడా తెలియదు. "నిద్రత్తొందనవద్దే పిచ్చిముండ ఆకలయితాదనాలె" అని చెప్పింది కొమరమ్మ లచ్చిని దగ్గరకు తీసుకొని దాని ముద్దు ముద్దు మాటలకు మురిసిపోయి ముద్దుపెట్టుకొంటూ.

కొమరమ్మ వంట పూర్తిచేసేసరికి కొడుకులిద్దరూ చెత్తకుండీలోంచి బయటికి తీసినవాళ్ళలా వంటినిండా మట్టి కొట్టుకొని వచ్చారు. "యాడికి బోయిన్రు" అని అడిగింది కొమరమ్మ వాళ్ళని.

"కొత్తగా కడుతున్న బంగ్లకాడపోయి ఆడుకున్నం" అని చెప్పారు పిల్లలిద్దరూ.

"చెల్లెని వదిలి పెట్టొద్దని ఎర్కలేదా మీకు ... పాని స్నానం చేయిస్త" అంది కొమరమ్మ కొడుకుల్ని మందలించి వాళ్ళ గుడ్డలు వూడదీస్తూ.

"అమ్మా! వద్దే ఆకలైతాంది. నీళ్ళు పోస్తే ఇంకింత ఆకలైతది." అన్నాడు పెద్దకొడుకు సీను దీనంగా. ఆమాట కొమరమ్మ గుండెల్లో గునపం దించినంతగా బాధపెట్టింది. ఎప్పుడో పొద్దుననగా సద్దన్నం తినిపించి కూలికి వెళ్ళింది తను. అంతకుమించి తనుమాత్రం ఏంచెయ్యగలుగుతుంది? ఇంట్లో బియ్యం, పప్పు ఉప్పూ అన్నీ నిండుకున్నాయి.

బొటబొటా కన్నీళ్ళు కారుస్తూ కొమరమ్మ పిల్లల్ని బరబరా ఈడ్చుకువెళ్ళి తొట్టిదగ్గర స్నానాలు చేయించింది. తల్లి బాధపడుతూ వుండటం చూసి పిల్లలు ఎదురు చెప్పలేకపోయారు. తానీ స్నానం చేస్తున్నంతసేపూ ఏడుస్తూనే వున్నారు.

స్నానాలు అయిపోయింతర్వాత పిల్లలకి అన్నం తినిపించి పడుకోబెట్టింది. ఎలాగైనాసరే తన దగ్గరవున్న డబ్బులలో పొద్దున్నె వెళ్ళి రెండు రూపాయలకు కిలోబియ్యం ఒక వారానికి సరిపడా తేవాలనుకొంది. అలాచేస్తేతప్ప తన పిల్లలు దిగులు లేకుండా వుండే అవకాశం లేదనిపించింది కొమరమ్మకు.

భర్త వచ్చేవరకు తిండి తినకుండా పిల్లల్ని గురించే ఆలోచిస్తూ పడుకొంది. ఆమెభర్త రాజన్నకి అసలు ఇల్లుపట్టదు. పొద్దున్న లేచినప్పటినుంచి చేసేపనంతా సాయంత్రం తాగటానికేనన్నట్లుగా వుంటుంది. పిల్లలు తిండి తిన్నారా లేదానన్న ఆలోచనకూడా వుండదతనికి. రాజన్న రాగానే అతనికి అన్నం వడ్డించి నిద్రకుపక్రమించింది కొమరమ్మ.


"ఏమె కూలి ముట్టిందా?" అన్నాడు రాజన్న కొమరమ్మని దగ్గరకు తీసుకుంటూ.

"ఊ" అంది కొమరమ్మ.

మర్నాడు ప్రొద్దున్న కొమరమ్మ లేచేసరికి రాజన్న ఇంట్లో లేడు. "ఇంత పొద్దుగాల యాడికి పోయిండబ్బా" అనుకొంది. డబ్బులు తీసుకొని వుడాయించాడేమోనన్న అనుమానం వచ్చి డబ్బులు దాచినచోట వెదికింది. అప్పుడప్పుడూ రాజన్నకి కొమరమ్మ కష్టార్జితాన్ని అపహరించడం అలవాటే.

ఇంట్లో డబ్బులు మాయమయ్యేసరికి కొమరమ్మ గుండెలు బాదుకొంటూ "సచ్చినోడు సావనన్న సావకపోయె. నన్ను, పిల్లల్ని బొందిగ పిసికి సంపనన్న సంపకపాయె"నని యేడ్చింది.

రాజన్నకోసం ఊరంతా గాలించింది. ఎక్కడా జాడ దొరకలేదు. వారంరోజులు రెక్కలు ముక్కలు చేసుకొంటేతప్ప




తనకి కూలిడబ్బులు చేతికిరావు. ఈవాంఛ రోజులు పిల్లల్ని ఎట్లా పోషించాలిరా భగవంతుడానని గూడు కూలిపోయిన కాకిలా విలపించింది.

ఇహ చెయ్యగలిగేదేమి లేక పిల్లలకి సద్దికూడు తినిపించికాలుతున్న కడుపుతో, మండుతున్న గుండెల్తో పనిలోకి వెళ్ళింది.

సాయంత్రం వరకూ రెక్కలు ముక్కలు చేసుకొని పని చేసింది. ఆ తరువాత అప్పుకోసం వూరు వూరంతా తిరిగింది. ఎక్కడా పైసా అప్పు పుట్ట లేదు. సేరు బియ్యం పుట్టలేదు. పైపెచ్చు చాలామంది ఆమెను పాతబాకీ తీర్చకుండా కొత్తగా అప్పు అడిగినందుకు సిగ్గులేని దానిలా చూసి తిట్టారు.

బాగా పొద్దుపోయిన తర్వాత ఊరంతా నిద్రపోయే సమయానికి ఇల్లుచేరింది కొమరమ్మ. కాలిపోయి చప్పగా చల్లారిపోయి నట్లుంది గుడిసె. ఇంట్లోకి అడుగు పెట్టే సరికి పిల్లలంతా ఆకలితో నకనకలాడుతూ ఆమెకోసం ఎదురు చూస్తున్నారు.

కూతురు లచ్చి అమ్మని చూడగానే దగ్గరకొచ్చి "అమ్మా! నిద్రొస్తోందే" అంది.

"అయితే పండుపో" అని విసుగ్గా అంది కొమరమ్మ.

తను ఆకలైతాంది అననందుకు అమ్మకు కోపం వచ్చిందనుకొని లచ్చి "ఆకలైతాంది" అంది దీనంగా.

"నన్ను కొరుక్కుతిను" అని పిల్లని పక్కకు నెట్టేసి లోపలికి వెళ్ళి గోనె పట్టాలు వేసి పిల్లల్ని తీసుకువచ్చి పడుకోబెట్టింది. తల్లి తనపట్ల ఎందుకు ఇంత నిర్దయగా వుందో అర్థంకాక పిల్ల ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి నిద్రపోయింది.

తల్లి పరిస్థితి అర్థం చేసుకొని మొగ పిల్లలు కిమ్మనకుండా పడుకొన్నారు. గడిచిపోయిన ఎన్నో ఆకలి దినాలు, రాత్రుళ్ళూ వాళ్ళకి ఈ పరిస్థితి మామూలు చేసింది. రాత్రి పదకొండు గంటలప్పుడు రాజన్న బాగా తాగి ఇల్లు చేరాడు. ఇల్లంతా గుప్పున సారాకంపు కొడుతోంది. తాగి

నప్పుడు రాజన్నని ఏమైనా అడిగి గొడవ పడటంవల్ల ప్రయోజనం లేదని తెలిసి కొమరమ్మ ఆతని ఉనికిని గమనించ నట్లుగా పడుకొంది. రాజన్న వచ్చి అమె ప్రక్కన పడుకొన్నాడు. అసహ్యంతో కొమరమ్మ బిగుసుకు పోయింది. రాజన్న బలవంతంగా కొమరమ్మని తనవైపుకు తిప్పుకొన్నాడు. "వద్దు ఇప్పుడు వద్దు నేను బయట వున్నాను" అంది. కొమ రమ్మ దూరం జరగాలని ప్రయత్నిస్తూ,

"ఇప్పటిదాకా ఎవనితో కులికినవే లం..." అని కూసాడు రాజన్న.

అసహ్యంతో, కోపంతో ఒక్క ఉదుటున అతని పట్టు వదిలించుకొని లేచి "ఛీ...ఛూ" అని కాండ్రించి ఉమ్మే సింది. రాజన్న కోపంతో "ఏమన్నావే లంజా ఇప్పుడు చెబుతానుండు నీ సంగతి" అంటూ లేచి వచ్చి కొమరమ్మని అందిన చోటల్లా కొట్టాడు.


ఒంటి మీద చీర బరబరా లాగేసాడు. జాకెట్ చింపేసాడు. ఈ గలాటావిని పిల్లలు లేచి ఏడవడం మొదలుపెట్టారు.

పిల్లలముందు ఆలా అర్ధనగ్నంగా నిల బడవలసి వచ్చినందుకు తల పగలకొట్టు కొని చావాలనిపించింది కొమరమ్మకు కొమరమ్మ రాజన్న కాళ్ళమీద పడింది. "నన్ను వదిలెయ్యి మామ. పిల్లల మొహం చూసన్న వదులు. బయటున్న కడుపునొ స్తుంది. నాకిష్టంలేదు" అని బతిమాలింది. రాజన్న యివేమి వినిపించుకోలేదు. కోపంతో వైపెక్కిన కళ్ళతో ఆమెమీధ పడ్డాడు.

కొమరమ్మ తన బలాన్నంతా కూడ దీసుకొని అతన్ని వదిలించుకొని వెళ్ళి రోకలిబండ అందుకొని బూతులు తిడుతూ వెంటపడ్డ రాజన్న తల పగలగొట్టేసింది.

గిలగిలా తన్నుకొని రాజన్న చనిపో యాడు. కొమరమ్మ బట్టలు కట్టుకొని వెళ్ళి పోలీసులకు జరిగింది చెప్పి లొంగి పోయింది.

అందుకనే కొమరమ్మ తను చేసిన నేరం ఒప్పుకుంటుందేమోనని అందరూ ఊహిస్తున్నారు. నిజంగా కొమరమ్మ నేరం చేసిందా?



తెలుగు ప్రోగ్రాములు ప్రారంభమయ్యాక నేను ముందే జాగ్రత్తపడి నా టీవీ అతనికమ్మేశానురా!!

ఇద్దరు లేడీ కానిస్టేబుల్స్ కొమరమ్మని కోర్టు హాల్లోకి తీసుకు వచ్చారు.

కొమరమ్మ ఎంత నీరసంగా కనిపిస్తున్నప్పటికీ ఎవరికీ తెలవని ఒక నిజం గ్రహించినదానిలా ఆమె మొహంలో ఏదో కాంతి దోబూచులాడుతోంది.

జనం ఆమెను చోద్యంగా చూస్తూ గుస గుసలాడుతున్నారు.

జడ్జిగారు 'సైలెన్స్ సైలెన్స్' అన్నారు. కోర్టంతా సైలెన్స్ అయిపోయింది.

జడ్జిగారు కొమరమ్మ కేసి చూసి "కొమరమ్మ అనబడే నీవు నీ భర్త అయిన రాజన్నని ఉద్దేశ్యపూర్వకంగా రోకలి బండతో కొట్టి చంపినందుకుగానూ సెక్షన్ 302 భారత శిక్షాస్మృతి క్రింద అభియోగం మోపడం జరిగింది. ఏమంటావు" అని కొమరమ్మమీద చార్జీ చదివి వినిపించారు.

"అవును నా మొగన్ని నేను రోకలి బండతోని కొట్టిన. నా మొగుడు నా పైసలెత్కపోయినందుకు కొట్టలేదు. నాకు రంకు అంటకట్నందుకు కొట్టలేదు. నేను బైటున్ననని, కడుపుల నొప్పితోని బాధపడుతున్నననీ, పిల్లలులేసి మిట్ట మిట్ట జూస్తున్నరనీ ఎంత జెప్పినా ఇనలేదు. ఇనకుండ నాతోని సంసారానికి తయారయిండు. నన్ను బలవంతం చెయ్యబోయిండు. ఇగ ఎక్కడేగలేక అదనుకు సేతికి దొరికిన రోకలి బండతోని ఒక్కటేసిన."

"అయ్యా! నా పైసలు నాయికాకపోతే ఫర్వాలేదుగని నా పెయ్యి నాదిగా కుండెట్లె తది? నన్ను గిచ్చితే నాకు మంటలేవదా? అప్పుడు మొగుడైతేంది? నా తనువు నా సేతుల్లేకుండె. ఐనా పసురం మోలె, పీనుగోలె ఆనితోని పక్కేసేదుండెనా చెప్పండ్రి?" (సంసారం చెయ్యాలా చెప్పండి) అని ప్రశ్నించింది కొమరమ్మ.

సూటిగా అడిగిన ఆమె ప్రశ్న విన గానే జడ్జిగారు ఆలోచనలో పడ్డారు. స్త్రీమీద అత్యాచారం చెయ్యడం నేర అలా అత్యాచారం జరుగుతున్నప్పుడు ఆ స్త్రీ గనుక ప్రతిఘటించి అత్యాచారం జరుపుతున్నవారి ప్రాణాలు తీస్తే అది నేరంకాదు. కానీ భార్య ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా భర్త ఆమెమీద జరిపే చర్య అత్యాచారం కాకుండా పోతుందా? ఇలా చేసినందుకు కొమరమ్మని అభినందించి అవార్డు ఇవ్వాలనిపించింది ఆయనకి. కానీ న్యాయశాస్త్ర రీత్యా కొమరమ్మకి శిక్ష వెయ్యక తప్పదు.

కేసు నడిచిన తర్వాత కొమరమ్మకి న్యాయస్థానం శిక్షరూపంలో అవార్డు ప్రకటించింది. ●●●

Edited & Published by V. Leelavathy Raghavaiah, at 1-8-4/1/1 Chikkadpalli, Hyder-bad-20 & Printed by P. Ramakrishna at Raghava Printers, 1-8-4/1/1 Chikkadpalli, Hyderabad-500 020